
సాక్షి
గుంటూరు
శనివారం । 4 । నవంబర్ । 2023



కుష్ఠు వ్యాధిపై అవగాహన

వేటపాలెం: కుష్ఠు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని లెప్రసీ డీపీఎం ఎండీ హసన్ సూచించారు. శుక్రవారం వేటపాలెంలో పర్యటించి కుష్ఠువ్యాధి కేసులను పరిశీలించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 4,610 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 1891 క్యూసెక్కులు వదిలారు.




సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు

పిడుగురాళ్ల: నాగులగుడిలోని సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి శుక్రవారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

షాదికారత

బడిబాటన చెంగుచెంగున పరుగులు తీయాల్సిన ఆ లేత పాదాలు పారాణి పూసుకుని ఏడడుగుల ఉచ్చులో చిక్కుకుంటున్నాయి. ఉన్నత శిఖరాలవైపు సగర్వంగా తలెత్తుకోవాల్సిన పుత్తడి బొమ్మలు చిన్నారి పెళ్లికూతుళ్లై తలవంచుకుని బలిపీటలెక్కుతున్నారు. బిడ్డల బంగారు భవితను కాంక్షించాల్సిన పెద్దలే పెళ్లి దండలు చేతికిచ్చి నిండు జీవితానికి పెను'దండ'న విధిస్తున్నారు. మూడుముళ్లతో ముళ్లబాట పరుస్తున్నారు. గుండెలను దహించే ఈ వి'షాది' ఘట్టాలకు నిస్సహాయంగా రగిలిపోతూ 'అగ్నిసాక్షి'గా మిగులుతోంది.. విష సంస్కృతిని నిలువరించే ఆపన్నహస్తాల కోసం భాజాభజంత్రీలు దిక్కులుపిక్కటిల్లేలా ఘోషిస్తున్నాయి. ఆ ఆర్తనాదాలు వినిపించాయో ఏమో.. ప్రస్తుతం గ్రామస్థాయిలోనే బాల్యవివాహాల నిరోధానికి కమిటీలు ఏర్పాటయ్యాయి. ఫలితంగా గత మూడు నెలల కాలంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 24 పెళ్లిళ్లను అధికారులు అడ్డుకున్నారు.

– గుంటూరు డెస్క్



మెడలో 'ఉరి'మాల

- ఆగని బాల్యవివాహాల విష సంస్కృతి
- యుక్తవయస్సు దాటకముందే పెళ్లిళ్లు
- శారీరక, మానసిక రుగ్మతలతో జీవితాంతం సతమతం
- నిరోధానికి ప్రభుత్వం కఠిన మార్గదర్శకాలు
- గ్రామస్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీలతో సత్ఫలితాలు
- అడ్డుకట్ట వేస్తున్న అధికారులు

పాణి'గ్రహణం వీడింది'.. చదువు సాగుతోంది

నాదెండ్లలో ఓ బాలిక పదోతరగతి వరకు చదువుకుంది. ఇక ఉన్నత విద్య అనవసరం అనుకున్న ఆమె తల్లిదండ్రులు ఓ వరుడిని చూసి వివాహం నిశ్చయం చేశారు. ఇది ఇష్టం లేకపోయినా ఆ చిన్నారి లోలోన కుమిలిపోతూనే తలవంచుకుని పెళ్లిపీటలెక్కేందుకు సిద్ధమైంది. గ్రామంలోనే స్నేహితురాళ్ల వద్ద తన గోడును వెళ్లబోసుకుంది. ఈ విషయం ఆ నోటా.. ఈనోటా.. గ్రామస్థాయి కమిటీ దృష్టికి వెళ్లింది. ఫలితంగా ఆగమేఘాలపై గ్రామానికి వచ్చిన అధికారులు పెళ్లిని అడ్డుకున్నారు. మేజర్లయ్యేవరకు పెళ్లి చేయబోమని వధూవరుల తల్లిదండ్రుల వద్ద లేఖ రాయించుకున్నారు. ఇప్పుడు ఆ బాలిక తిరిగి ఉన్నత విద్యాభ్యాసం హాయిగా సాగిస్తోంది.

బాల్య వివాహాలను ఆపేందుకు ప్రభుత్వాలు అనేక చట్టాలను రూపొందించినా అవగాహన లేమి వల్ల ఎంతోమంది మైనర్లు పెళ్లిపీటలెక్కుతున్నారు. చదువుకుని సమాజంలో ఉన్నతస్థితికి చేరనీయకుండా, తామేంటో నిరూపించుకోనివ్వకుండా పెద్దలే లేత మనసులను బంధాలకు బానిసల్లా మార్చడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో బాలబాలికలు శారీరక, మానసికంగా, ఆరోగ్యపరంగా ఎన్నో అవస్థలు పడుతున్నారు. గతంలో జరిగిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో బాల్యవివాహాల్లో ఏపీ ఐదోస్థానంలోనూ, పల్నాడు జిల్లా 16వ స్థానంలో ఉన్నాయి. ఇది ఆందోళన కలిగించే అంశం. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం 'బాల్యవివాహ నిషేధచట్టం–2006' పటిష్ఠ అమలుకు చర్యలు తీసుకుంటోంది. గ్రామ సచివాలయ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి 18 ఏళ్లలోపు బాలికలకు పెళ్లి చేయడాన్ని ఆపాలని అధికారులను ఆదేశించింది. వీటి ఫలితంగానే ఉమ్మడి గుంటూరు జిల్లాలో గత మూడునెలల కాలంలో 24 బాల్యవివాహాలను అధికారులు అడ్డుకున్నారు.



బాల్య వివాహాలతో అనర్థాలివే..

- 14, 15, 16 ఏళ్ల వయస్సులోనే అమ్మాయిలకు పెళ్లి చేయడం వల్ల వయో పరిపక్వత లేక శారీరక, ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.
- ఆలోచన శక్తి తక్కువగా ఉన్నందున కొందరు ఒత్తిళ్లకు గురై ఆత్మహత్యలకు పాల్పడతారు.
- చిన్న వయస్సులోనే గర్భం దాల్చడంతో మాతాశిశు మరణాలు సంభవిస్తాయి.
- వయోజన తల్లులతో పోలిస్తే 18 ఏళ్ల వయసులోపు తల్లులకు పుట్టే బిడ్డలకు 75 శాతం శిశు మరణాలు సంభవిస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి.
- 15–19 ఏళ్ల మధ్య పెళ్లయిన బాలికల్లో ఐదు శాతం మంది గర్భం దాల్చిన తర్వాత రక్తహీనత, తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని జాతీయ కుటుంబ సర్వే స్పష్టం చేసింది.
- బాల్య వివాహాలతో కాపురాల్లో కలహాలు రేగుతాయి. నిరక్షరాస్యత వల్ల గృహహింస కేసులు నమోదవుతున్నాయి.

ప్రభుత్వ పటిష్ఠ చర్యలు

బాలికా విద్యను ప్రోత్సహిస్తే కుటుంబమంతా విద్యావంతులై వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకునే అవకాశం ఉంటుందని ప్రభుత్వం మహిళా శిశుసంక్షేమశాఖ ద్వారా ప్రచారం చేస్తోంది. బాల్య వివాహాల నిరోధానికి పెళ్లిళ్ల రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేసింది. అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్లు నిండాకే పెళ్లి చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది. మేజర్లయితేనే వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకాల లబ్ధి చేకూరుస్తామని ఉద్ఘాటించింది. ఇందుకు పదోతరగతి ఉత్తీర్ణత సాధించాలనే నిబంధననూ విధించింది. 15–18 ఏళ్ల మధ్య గల డ్రాపౌట్ బాలికల్ని గుర్తించి పాఠశాల, కళాశాలల్లో తిరిగి చేర్పిస్తోంది. గ్రామాల్లో వీటిని నియంత్రించేందుకు ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా గ్రామాలను సందర్శించినప్పుడు తల్లిదండ్రులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. బాల్య వివాహాల వల్ల ఎదురయ్యే దుష్పరిణామాలను వివరిస్తున్నారు. ప్రభుత్వం చైతన్య సదస్సులు నిర్వహించినా, మరెన్ని చట్టాలు చేసినా మార్పు అనేది ముందుగా కుటుంబ వ్యవస్థలో రావల్సిన అవసరం ఉంది. దీనిపై అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు, విద్యాలయాల్లో బాలబాలికలకు అవగాహన కల్పిస్తున్నారు.

అధికారులకు సమాచారమిద్దాం

బాల్యవివాహాలు చేస్తున్నారనే సమాచారం తెలిస్తే స్థానిక సచివాలయం సిబ్బంది, మహిళ పోలీసు, అంగన్‌వాడీ కార్యకర్తలకు, మండలస్థాయిలో తహసీల్దార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఎస్ఐ, ఏపీఎం, జిల్లాస్థాయిలో కలెక్టర్, ఆర్డీఓ, ఐసీడీఎస్ పీడీకి తెలియజేయాలి. లేదా తక్షణ సహాయం కోసం హెల్ప్‌లైన్ ద్వారా సమాచారం అందిస్తే వారి పేర్లు గోప్యంగా ఉంటాయి.

చైల్డ్ హెల్ప్‌లైన్	: 1098
ఏపీ పోలీస్ హెల్ప్‌లైన్	: 100
ఉమెన్ హెల్ప్ లైన్	: 181
సాధారణ హెల్ప్‌లైన్	: 112

చట్టం ఏం చెబుతోంది

- 18 ఏళ్లలోపు బాలికలకు, 21 ఏళ్లలోపు బాలురకు వివాహం చట్టరీత్యా నేరం.
- 18 ఏళ్లలోపు అమ్మాయిలకు పెళ్లి చేసిన ఎంతటివారైనా సరే జైలుకు పంపేలా పోక్సో చట్ట సవరణ జరిగింది.
- బాల్య వివాహానికి హాజరైన వారికి ఐపీసీ సెక్షన్ 12 ప్రకారం రెండేళ్ల వరకు జైలు, రూ.లక్ష జరిమానా
- 18 ఏళ్లలోపు బాలికతో శారీరకంగా కలిస్తే పదేళ్లకుపైగా జైలు. అదే 16 ఏళ్లలోపు వారితే కలిస్తే 20 ఏళ్లకు పైగా శిక్ష.
- మేజర్‌కు ఇచ్చి మైనర్‌కు పెళ్లిచేస్తే తల్లిదండ్రులకు పోక్సో చట్ట ప్రకారం పదేళ్ల జైలుశిక్ష
- బాల్య వివాహాలను ప్రోత్సహించే తల్లిదండ్రులకు రెండేళ్ల జైలు
- బాల్య వివాహాలను అరికట్టడంలో విఫలమైన అధికారులపై చర్యలు
- బాల్య వివాహాలను ప్రోత్సహించే కుటుంబాలకు సంక్షేమ పథకాలు రద్దు
- వివాహ రిజిస్ట్రేషన్‌కు ఉన్న 60 రోజుల గడువును 6 నెలలకు పెంచే చట్ట సవరణ తెచ్చే యోచన
- మహిళా సంఘ సభ్యురాలి కుటుంబంలో బాల్య వివాహం జరిగితే, సదరు సంఘానికి రూ.50 వేల జరిమానా
- బాల్య వివాహం కుదిర్చిన వ్యక్తులు, పెళ్లి సంబంధాలు చూసిన సంస్థలు, వారికి పెళ్లి చేసిన మతపెద్దలు, పెళ్లిని కవరేజ్ చేసిన వీడియో గ్రాఫర్లు, వంటవాళ్లు కూడా ఐపీసీ సెక్షన్ 10 ప్రకారం శిక్షార్హులు. వీరికి రూ.లక్ష జరిమానా, రెండేళ్ల జైలు విధించే అవకాశం.

గ్రామస్థాయిలో కమిటీలతో కట్టడి



కలెక్టర్ పర్యవేక్షణలో బాల్య వివాహాల నిరోధానికి గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీల ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. గ్రామ స్థాయిలో ప్రత్యేక కమిటీలు బాల్య వివాహాలను కట్టడికి కృషి చేస్తున్నాయి. పాఠశాలల్లో విద్యార్థినులకు, అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలకు, తల్లిదండ్రులకు, గ్రామైక్య, మహిళా సంఘాలకు అవగాహన కల్పిస్తున్నాం. మరోవైపు కరపత్రాలు, గోడపత్రికలు, ర్యాలీలతో విస్తృత ప్రచారం చేస్తున్నాం. స్వచ్ఛంద సంస్థలు, వివిధశాఖల అధికారుల సమన్వయం, ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో బాల్య వివాహాలకు చెక్ పెడుతున్నాం. సత్ఫలితాలు సాధిస్తున్నాం.

– బి.అరుణ, ఐసీడీఎస్ పీడీ, పల్నాడు

న్యూస్‌రీల్

నూతన డబ్లింగ్ రైల్వే ట్రాక్ పరిశీలన



నరసరావుపేట: గుంటూరు–నంద్యాల మార్గంలో సాతులూరు నుంచి నరసరావుపేట మీదుగా మునుమాక రైల్వేస్టేషన్ వరకు ఏర్పాటు చేసిన నూతన డబ్లింగ్ రైలు పట్టాల ట్రాక్‌ను రైల్వేసేఫ్టీ ఆఫీసర్ ఎం.ఎం. చౌదరి శుక్రవారం పరీక్షించారు. ఈ 19 కిలోమీటర్ల ట్రాక్‌పై నాలుగు ట్రాలీల్లో అధికారులు అందరూ ప్రయాణించి పరిశీలించారు. చౌదరితో పాటు డీఆర్ఎం జి.రామకృష్ణ, రైల్వే ఇంజినీర్లు , ట్రాక్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

యార్డులో 23,318 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 21,016 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 23,318 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 25,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.11,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.13,500 నుంచి 25,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 8,663 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

నేడు రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు



గుంటూరు వెస్ట్ (క్రీడలు): 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి అండర్–14, 17 బాల బాలికల టేబుల్ టెన్నిస్ పోటీలను శనివారం మంగళగిరి మండలం ఖాజా గ్రామంలో నిర్వహిస్తామని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి గాదె ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక బీఆర్ స్టేడియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి 260 క్రీడాకారుల సహా మొత్తం 350 మంది పాల్గొంటారన్నారు. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. నిర్వహణకు సంబంధించి పీఈటీలతో బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

ఆర్టీసీ అధికారులపై దాడులకు నిరసన



పాత గుంటూరు : కావలి సమీపంలో విజయవాడ ఆటోనగర్ డ్రైవర్ రామ్‌సింగ్‌పై రౌడీమూకల దాడి, తుణుకు డిపో మేనేజర్ గిరిధర కుమార్‌పై ఆదే డిపో డ్రైవర్ నాగరాజు కత్తితో దాడిని ఆర్టీసీ గుంటూరు జిల్లా అధికారుల సంఘం తీవ్రంగా ఖండించారు. ఈ సంఘటనలను నిరసిస్తూ శుక్రవారం వారు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ప్రజారవాణా అధికారి ఎం. రవికాంత్, డెప్యూటీ సీఎంఈ నర్రా శ్రీనివాసరావు, వైద్యాధికారిణి విజయలక్ష్మి, 1, 2 డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

17న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్ : ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ స్థాయీ సంఘాలు ఈనెల 17న భేటీ కానున్నాయి. ఈ మేరకు జెడ్పీ సీఈవో జె. మోహన్‌రావు శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఏడు స్థాయీ సంఘాలకు సంబంధించిన సభ్యులు, అధికారులు జెడ్పీలో భేటీ కానున్నారు. వీటిలో ప్రణాళిక–ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య–వైద్యం, అభివృద్ధి పనులకు సంబంధించిన 1, 2, 4, 7వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరగనున్నాయి. అదే విధంగా వ్యసాయంపై 3వ స్థాయీ సంఘ సమావేశానికి జెడ్పీ వైస్ చైర్మన్ శొంటిరెడ్డి నర్సిరెడ్డి, స్త్రీ–శిశు సంక్షేమంపై 5వ స్థాయీ సంఘానికి తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, సాంఘిక సంక్షేమంపై 6వ స్థాయీ సంఘ సమావేశానికి జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షత వహించనున్నారు.

'ప్రకృతి' పరవళ్లు

- ప్రకృతి వ్యవసాయం విస్తరణకు ప్రభుత్వం కృషి
- రైతులకు ప్రోత్సాహకాలు
- ఈ ఏడాది గుంటూరు జిల్లాలో 25వేల ఎకరాల్లో సాగు లక్ష్యం
- తగ్గుతున్న రసాయన ఎరువుల వాడకం
- కిచెన్ గార్డెన్స్, డాబాలపై కూరగాయల సాగు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: పెట్టుబడి వ్యయాన్ని తగ్గించి రసాయన అవశేషాల్లేని పంటలను పండించే విధానాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్రం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోంది. ప్రకృతి సేద్యానికి ప్రాధాన్యం ఇస్తోంది. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ప్రకృతి వ్యవసాయం కాగితాలపై మాత్రమే కనిపించేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉద్యమ తరహాలో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తోంది. ఈ ఏడాది పెద్ద ఎత్తున ప్రకృతి సేద్యాన్ని చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది.

ప్రకృతి వ్యవసాయం సరైన మార్గం..

ఒకప్పుడు హరిత విప్లవంతో వ్యవసాయం ఆధునిక బాటపట్టింది. ఫలితంగా రానురాను రసాయన ఎరువుల వినియోగం విచ్చలవిడిగా పెరిగింది. దీంతో పంటల్లో రసాయన అవశేషాలు ఉంటున్నట్టు శాస్త్రీయంగా నిర్ధారణైంది. పంట భూములూ నిస్సారంగా మారుతున్నట్టు తేలింది. ఈ పరిస్థితుల నుంచి బయట పడటానికి ప్రకృతి సేద్యం ఒక్కటే మార్గమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. దీంతో ప్రస్తుత ప్రభుత్వం రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించేందుకు విశేష కృషి చేసింది. గత రెండేళ్ల గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం సుస్పష్టమవుతోంది.

ఈ ఏడాది లక్ష్యాలు ఇలా..

ఈ ఏడాది ప్రకృతి సేద్యం విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. గుంటూరు జిల్లాలో 80 గ్రామాల్లో 83 రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవగాహన కల్పించింది. ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా అధికారులు ప్రణాళికలు రచించారు. ఈ ఏడాది 22,500 మంది రైతులతో 25 వేల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేపట్టాలనేది లక్ష్యం. ఇందుకు దేశవాళీ ఆవుల అవసరం ఉంది. ఆవు మూత్రం, పేడను ఉపయోగించి ఘన, ద్రవ జీవామృతం, ఇతర ఉత్పాదకాలను తయారు చేస్తారు. ఈ ఏడాది జిల్లాలో ఇప్పటి వరకు 9,500 మంది రైతులతో 15,400 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేయిస్తున్నారు. కిచెన్ గార్డెన్స్, మిద్దె పంటల సాగును ప్రోత్సహిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచేందుకు పొలంబడి కార్యక్రమాలూ నిర్వహిస్తున్నారు. పంట దిగుబడులు ఎలా వస్తున్నాయనే దానిని తెలుసుకునేందుకు పంట కోత ప్రయోగాలు జరుపుతున్నారు.

పెరటి తోటల అభివృద్ధి

గ్రామైక్య సంఘాల ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తృతం చేయాలనే లక్ష్యంతో రైతు సాధికార సంస్థ ప్రకృతి వ్యవసాయ విభాగం సెర్ప్‌తో అవగాహన ఒప్పందం(ఎంఓయూ) కుదుర్చుకుంది. ఇందులో భాగంగా 140 గ్రామాల్లోని 185 గ్రామైక్య సంఘాల ద్వారా ప్రకృతి వ్యవసాయ విధానంలో ఆకుకూరలు, కూరగాయల సాగును చేపట్టారు. సెంటు భూమి నుంచి 10 సెంట్ల వరకు స్థలంలో పెరటి తోటలు అభివృద్ధి చెందాయి. గర్భిణులు, బాలింతలకు పోషక విలువలు కలిగిన ఆహారం అందజేయాలనే లక్ష్యంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రకృతి సేద్య కిచెన్ గార్డెన్లు అభివృద్ధి చేసి ఆకు కూరలు, కూరగాయలు పండించడం విశేషం.

మిద్దెతోటల పెంపకం

మిద్దె తోటలు పెంచడంలో జిల్లాలో గుంటూరు ముందు వరుసలో ఉంది. గుంటూరు జిల్లాలో సుమారు 2,500 మంది డాబాలపై సేంద్రియ పద్ధతుల్లో కూరగాయలు, పూలు సాగు చేస్తుండగా, ఒక్క గుంటూరు నగరంలోనే సుమారు 1000 మందికిపైగా మిద్దెతోటలు సాగు చేస్తున్నారు. వీరికి ఉద్యానశాఖ 22 రకాల పంటల సాగుకు విత్తనాలు, గ్రోబ్యాగ్‌లు, మట్టి అందించింది. ఇందుకు రూ.6 వేలు ఖర్చుకాగా, రూ.3 వేల వరకూ రాయితీ ఇస్తోంది. ఆసక్తి ఉన్న వారికి కూరగాయల పెంపకంపైనా శిక్షణ ఇస్తోంది. ఔత్సాహికులకు స్ప్రేయర్లు, రోజ్ క్యాన్ వంటి పరికరాలూ రాయితీపై అందజేస్తోంది.



ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన వరి పంటలో తాడిబోయిన విజయలక్ష్మి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో రెండేళ్లలో రసాయన ఎరువుల వాడకం తగ్గుముఖం ఇలా..

సంవత్సరం	వాడిన ఎరువులు(మెట్రిక్‌టన్నులు)
2021–22	3,35,500
2022–23	3,10,200
తగ్గిన వినియోగం	25,300

ఉద్యమస్థాయిలో..



రసాయన అవశేషాలు ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల ప్రస్తుతం ప్రజలు అనేక వ్యాధులతో సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయానికి ఆదరణ పెరుగుతోంది. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటలకు ఖర్చు తగ్గడంతో పాటు, నాణ్యమైన అధిక దిగుబడులు వస్తున్నాయి. తెగుళ్లు కూడా సోకడం తక్కువగా గుర్తించడం జరిగింది. ఈ ఏడాది గుంటూరు జిల్లాలో 25 వేల ఎకరాలల్లో ప్రకృతి వ్యవసాయంలో పంటలు పండే విధంగా లక్ష్యాన్ని నిర్ణయించుకున్నాం. రాబోయే రోజుల్లో ఉద్యమస్థాయికి తీసుకెళ్తాం.

– కె.రాజకుమారి, జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్

సేద్య 'విజయ'ం



కషాయం తయారు చేస్తున్న తాడిబోయిన విజయలక్ష్మి, తదితరులు

ఈ చిత్రంలో ఎడమవైపు నుంచి రెండో మహిళ పేరు తాడిబోయిన విజయలక్ష్మి. ఊరు తెనాలి మండలం, ఎరుకలపూడి. వృత్తి రైతు. పదో తరగతి చదివిన ఆమె అనితరసాధ్యమైన బాధ్యతను తలకెత్తుకున్నారు. ఐదేళ్లుగా దిగ్విజయంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. రెండున్నర ఎకరాల పొలంలో వేసవిలో పచ్చిరొట్ట, పల్సస్, ఆయిల్‌పామ్, కూరగాయలు, చిరుధాన్యాలు సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌లో వరి పంట సాగు చేస్తూ అందులో మూడు రకాలు బీపీటీ–5204, బ్లాక్ రైస్, సన్నాలు పండిస్తున్నారు. రబీలో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన జీవామృతాలను ఇలా తోటి మహిళలతో కలిసి స్వయంగా తయారు చేసుకుంటున్నారు. అన్ని పంటలకు కలిపి ఏడాదికి రూ.70 వేల వరకు పెట్టుబడి పెడుతున్నారు. పెట్టుబడి వ్యయం మినహాయిస్తే ఏడాదికి రూ.5 లక్షలకుపైగా ఆదాయం ఉంటోందని విజయలక్ష్మి ఆనందంగా చెబుతున్నారు.

'జగనన్నకు చెబుదాం'తో ప్రజా సమస్యల పరిష్కారం

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

తెనాలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్నకు చెబుదాం'లో వచ్చిన అర్జీలన్నింటినీ చిత్తశుద్ధితో పరిష్కరించాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని శుక్రవారం ఇక్కడి కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ రాజకుమారి, తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై వచ్చిన అర్జీదారుల సమస్యలను ముందుగా ఆన్‌లైన్‌లో నమోదుచేసిన అనంతరం వారికి రశీదులను అందజేశారు. ఆయా అర్జీదారులతో కలెక్టర్, జేసీ, సబ్‌కలెక్టర్‌లు నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత జిల్లా, మున్సిపల్, మండలస్థాయి అధికారులకు పరిష్కారం నిమిత్తం అందజేశారు. మధ్యాహ్న భోజనం తర్వాత ఆయా సమస్యలపై క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. వివిధ ప్రభుత్వ విభాగాలకు సంబంధించి మొత్తం 73 మంది అర్జీలను సమర్పించారు. వీటిలో పంచాయతీలకు సంబంధించిన సమస్యలు అధికంగా వచ్చాయని కలెక్టర్ వెల్లడించారు. చిన్న చిన్న సమస్యలపై ఎంపీడీఓలు జిల్లా పరిషత్ సీఈఓ, డీఎల్‌డీఓలతో సంప్రదించి, సాంకేతిక సమస్యలు, ఆధార్ సీడింగ్‌కు సంబంధించినవి వెంటనే పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు. మళ్లీ మళ్లీ ఇవే సమస్యలు మన ముందుకు రాకుండా చూడాలని స్పష్టంచేశారు. జిల్లా అధికారులు గ్రామాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో రైతుభరోసా కేంద్రాలకు వెళ్లి ఎరువులు, విత్తనాలు వంటి సమస్యలను పరిశీలించాలని చెప్పారు. హైలెవెల్ చానల్ పరిధిలోని ఆయకట్టుకు సాగునీటి సమస్యను పరిశీలించి చర్యలు తీసుకోవాలని జలవనరులశాఖ అధికారులను ఆదేశించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. గృహనిర్మాణ సంస్థ అధికారులు జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మాణ ప్రగతిని సమీక్షించాలని సూచించారు. పంచాయతీరాజ్ అధికారులు సంబంధిత నిర్మాణంలో వున్న భవనాల పురోగతిని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామాల్లోని తాగునీటి అంశాలపై సమ్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యలకు మెరుగైన పరిష్కారం కోసమని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని గత మే నెల 9న ప్రారంభించినట్టు గుర్తుచేశారు. ఇందుకోసం 1902 టోల్‌ఫ్రీ నంబరును ప్రవేశపెట్టినట్టు తెలిపారు. ఈ క్రమంలో గతనెలలో జిల్లాల అధికారులను సమావేశపరిచి ఒక్కోవారంలో బుధ, శుక్రవారాల్లో మండల కేంద్రాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించినట్టు కలెక్టర్ చెప్పారు. ఇప్పటికే జిల్లాలోని కొన్ని మండలాల్లో పూర్తిచేయగలిగినట్టు తెలిపారు. ప్రస్తుత సమావేశంలోనూ వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదుచేసి, ఆయా సమస్యలను నిర్దిష్ట వ్యవధిలోగా చిత్తశుద్ధితో పరిష్కరించాలని ఆదేశించినట్టు కలెక్టర్ చెప్పారు. జిల్లా పంచాయతీ అధికారి కె.శ్రీదేవి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, చేనేత జౌళిశాఖ ఏడీ వనజ, జెడ్పీ సీఈవో మోహనరావు, పశుసంవర్ధకశాఖ జేడీ వెంకటేశ్వరరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు, ముఖ్య ప్రణాళిక అధికారి శేషశ్రీ, వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ సువార్త, ఏడీ మార్కెటింగ్, పీడీ హౌసింగ్‌తోపాటు మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, మండల తహసీల్దార్ కె.రవిబాబు, ఎంఈఓ మేకల లక్ష్మీనారాయణ, డీఎల్‌డీఓ కె.పద్మావతి, డీఎల్‌పీఓ స్వరూపరాణి, ఆర్టీసీ డిపో మేనేజరు ఎ.రాజశేఖర్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. తొలుత సమావేశ స్థలానికి వచ్చిన కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డికి స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కలిశారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి చిత్రంలో జేసీ రాజకుమారి, సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ

సజావుగా 'సీస్' పరీక్ష

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పరీక్షించేందుకు శుక్రవారం స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (సీస్–2023) గుంటూరు జిల్లాలోని పాఠశాలల్లో సజావుగా జరిగింది. 482 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 3,6,9వ తరగతుల వారీగా 19,347 మంది విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో డైట్ అధ్యాపకుల పర్యవేక్షణలో బీఎడ్, డీఎడ్, ఇంజినీరింగ్, పీజీ విద్యార్థులను ఇన్విజిలేటర్లుగా నియమించారు. ఎంఈఓలు మండలస్థాయిలో కో–ఆర్డినేటర్లుగా వ్యవహరించారు. 3వ తరగతిలో 5,690, ఆరో తరగతిలో 6,883, 9వ తరగతిలో 6,774 మంది చొప్పున విద్యార్థులు హాజరైనట్లు డీఈఓ పి.శైలజ తెలిపారు. తుళ్లూరు మండలం మందడంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పరీక్ష నిర్వహణ తీరు, తెన్నులను పరిశీలించారు.



మందడంలో పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న ప్రవీణ్ ప్రకాష్

క్లుప్తంగా

గుంటూరులో సాధికార బస్సు యాత్ర జయప్రదం చేయాలి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ పిలుపు



పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 4వ తేదీన గుంటూరు తూర్పు నియోజకవర్గంలో నిర్వహించ తలపెట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర, బహిరంగ సభను జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం బృందావన్ గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సామాజిక సాధికార బస్సు యాత్ర ద్వారా ఇప్పటి వరకు బడుగు, బలహీన, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సంబంధించి చేసిన మేలును వివరించేందుకు నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు ప్రాధాన్యత కల్పించి నిరంతరం వారి సంక్షేమం కోసం పాటు పడుతున్న ఏకైక ముఖ్యమంత్రి సీఎం వై.ఎస్.జగన్ అని కొనియాడారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న ఈ యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరవుతారని తెలిపారు.

యర్రబాలెంలో బంగారం, వెండి చోరీ

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం శ్రీనగర్ కాలనీలో శుక్రవారం సుమారు రూ. 5.50 విలువైన బంగారు, వెండి ఆభరణాల చోరీ అయ్యాయి. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. జొన్నాదుల సుధాకర్ విజయవాడలో బంగారపు పనిచేస్తూ శ్రీనగర్‌లో తన తల్లి తండ్రితో కలిసి నివాసముంటున్నాడు. గత వారం రోజుల క్రితం సుధాకర్ తల్లి, తండ్రి బట్టిప్రోలు బంధువుల ఇంటికి వెళ్లగా సుధాకర్ ఒక్కడే ఉంటున్నాడు. గురువారం రాత్రి సుధాకర్ విజయవాడ నుంచి ఇంటికి వచ్చే సరికి తలుపులు పగలగొట్టి ఉండడంతో చోరీ జరిగిందని భావించి పోలీసులకు సమాచారమిచ్చా రు. సుమారు రూ.5.50 లక్షల విలువైన 90 గ్రాముల బంగారం, రూ పది వేల నగదు, వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు పోలీసులకు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధికి దోహదం చేసే బడ్జెట్ రూపకల్పనకు ప్రణాళికలు

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



అధికారులతో సమావేశమైన జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరుఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా అభివృద్ధికి దోహదం చేసే బడ్జెట్ రూపకల్పనకు శాఖల వారీగా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధికారులకు సూచించారు. జెడ్పీ కార్యాలయంలోని చైర్‌పర్సన్ చాంబర్లో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ 2023–24 సవరణ బడ్జెట్‌తోపాటు వచ్చే ఆర్థిక సంవత్సర బడ్జెట్ రూపకల్పనపై వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అకౌంట్ అధికారులతో బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా జెడ్పీకి పంపే ప్రతిపాదనలపై జెడ్పీ స్టాండింగ్ కమిటీలతోపాటు సర్వసభ్య సమావేశంలో చర్చించి, ఆమోదించడం ద్వారా ప్రభుత్వానికి పంపాల్సి ఉందన్నారు. 15వ ఆర్థిక సంఘ నిధుల మంజూరుపై ఆధారపడి చేపట్టి, పూర్తిచేసిన పనులకు చెల్లింపులపై సమీక్షించారు. సమావేశంలో జెడ్పీ గణాంక అధికారి జి.శ్రీనివాసరావు, ఏవోలు ఎల్ఎస్‌టీ నాగరాజు, వి.రాజారత్నబాబు, ఎ.కళ్యా, కె.హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఓటర్ల జాబితాలో పేర్లు పరిశీలించుకోవచ్చు

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్ : ముసాయిదా ఓటర్ల జాబితాలో తమ పేర్లను పరిశీలించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి కోరారు. శని, ఆదివారాల్లో సమీపంలోని పోలింగ్ బూత్‌ల వద్ద ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఓట్లు పరిశీలించడంతోపాటు తమ అభ్యంతరాలను తెలపడం, క్లెయిమ్స్‌ను అందించడం చేయవచ్చన్నారు. బీఎల్‌వోలు ఉదయం 10 నుంచి సాయంత్ర 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇక నుంచి వాహన్ పోర్టల్‌లో ఆర్టీఏ సేవలు

డీటీసీ షేక్ కరీం

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): గుంటూరు జిల్లాలో వాహనాలకు సంబంధించిన అన్ని కార్యకలాపాలు ఇకపై వాహన్ పోర్టల్‌ను వినియోగించుకోవాలని డీటీసీ షేక్ కరీం సూచించారు. ఈమేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వాహన బదిలీలు, చిరునామా మార్పు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్‌లు, ఎన్‌ఓసీ, ట్యాక్స్‌ల చెల్లింపులతోపాటు, అన్ని రకాల సేవలు వాహన్ పోర్టల్ ద్వారా పొందాలన్నారు. ఇప్పటి వరకు ఆర్టీఏ శాఖ ఈప్రగతి సాఫ్ట్‌వేర్ ద్వారా జరుగుతున్నాయని, జాతీయ రహదారి శాఖ ఆధ్వర్యంలో వాహన్ అండ్ సారథి అనుసంధానం జరిగిన నేపథ్యంలో ఆర్టీఏ కార్యాలయ పరిధిలో ఉన్న సేవలన్ని వాహన్ పోర్టల్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. వాహన యజమానులు ఈనెల 6వ తేదీ నుండి హెచ్‌టీటీపీఎస్//పరివాహన్.జీఓవీ.ఇన్. వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలన్నారు.

పెదకాకాని శివాలయంలో కార్తీక మాస నిత్యాభిషేకం

పెదకాకాని: శివాలయంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని నిత్యాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానానికి వచ్చి అభిషేకంలో పాల్గొనడానికి వీలుకాని భక్తుల సౌకర్యార్థం ఆన్‌లైన్ ద్వారా పరోక్ష కార్తికమాస నిత్యాభిషేక పథకం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ పథకం ద్వారా 2 వేల రూపాయలు చెల్లించిన భక్తులకు ఈనెల 14 నుంచి డిసెంబరు 12వ తేదీ వరకూ గోత్రనామములతో కార్తికమాసం మొత్తం అభిషేకం జరిపించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం ప్రసాదం, స్వామివారి శేషవస్త్రం కోరియర్ సర్వీసు ద్వారా పంపించడం జరుగుతుందని వివరించారు. అలానే ఈ మాసంలో దర్శనమునకు వచ్చినట్లయితే ఉచితంగా దర్శనం కల్పించడం జరుగుతుందని ఏసీ వివరించారు. పూర్తి వివరాలకు కౌంటర్ నంబరు 91823 71954, చల్లా శ్రీను 9441612933 లకు ఫోన్ చేయవచ్చన్నారు.

పత్తి, వరిలో యాజమాన్య పద్ధతులు చేపట్టాలి



సత్తెనపలి: ప్రస్తుతం బెట్ల వాతావరణ పరిస్థితుల కారణంగా పత్తి, వరి పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు చేపట్టాలని పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఐ మురళి చెప్పారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం బృగుబండ, కందులవారిపాలెం గ్రామాలలో పత్తి, వరిపంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. మురళి మాట్లాడుతూ పత్తి పంటలో పూత, పిందె రాలడం జరుగుతుందని, అక్కడక్కడ గులాబీరంగు పురుగు కూడా ఉందన్నారు. పూత పిందె నివారణకు బోరాక్స్ 300 గ్రాములు, 19:19:19, లే మూడు 17లు లేదా ఒక కేజీ మల్టీకే 1 కేజీ ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. గులాబీ రంగు పురుగును అదుపు చేయడానికి ఎకరాకు 10–20 లింగాకర్షక బుట్టలు పెట్టాలన్నారు. ఖరీఫ్ 2023 సీజన్‌లో ఎవరైతే పత్తి పంట సాగుచేసి ఈ క్రాప్ నమోదు చేయించుకున్న రైతులు ఉన్నారో వారు తమ గ్రామంలోని రైతు భరోసా కేంద్రం సిబ్బందిని కలసి పత్తి కొనుగోలు కేంద్రంలో పత్తిని విక్రయించుకోవడానికి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. పత్తి పంటకు ప్రభుత్వం కనీస మద్దతు ధర క్వింటాకు రూ.7020 ఉందన్నారు. దళారులకు తక్కువ ధరకు అమ్మి మోసపోకుండా మార్కెట్ యార్డులోని పత్తి కొనుగోలు కేంద్రాలలో పత్తి విక్రయించుకోవాలని సూచించారు. ఎస్ శ్రీధర్‌రెడ్డి, వీఏఏలు జ్యోతి, ఎస్ ప్రశాంత్ పాల్గొన్నారు.

75 ఏళ్లలో జరగని సామాజిక న్యాయం ఇది

ఎమ్మెల్సీ పోతుల సునీత



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పోతుల సునీత

దాచేపల్లి : స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 75 ఏళ్లలో జరగని సామాజిక న్యాయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరుగుతుందని ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ సునీత మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు రాజకీయాల్లో సమాన అవకాశాలు కల్పించిన ఘనత సీఎం జగన్‌కు మాత్రమే దక్కుతుందని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రకటించిన మేనిఫెస్టోను 95శాతం అమలు చేశామని, ప్రజల అవసరాల మేరకు మరిన్ని పథకాలు అమలు చేస్తున్నామన్నారు.

గత టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధి కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితమైందని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. చిన్న వయస్సులోనే సీఎంగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుండేలా ఆహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు.

మహిళల ఫుట్‌బాల్ విజేత అనంతపురం

- మహిళల ఫుట్‌బాల్ విజేత అనంతపురం
- రెండో స్థానం సాధించిన సత్యసాయి జిల్లా
- విజేతలకు బహుమతులు అందజేసిన ఎంపీ కె.శ్రీధర్, ఏఎన్‌యూ వీసీ



అనంతపురం జిల్లా జట్టుకు బహుమతి అందజేస్తున్న ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్

ఏఎన్‌యూ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల మహిళల ఫుట్‌బాల్ పోటీల విజేతగా అనంతపురం జిల్లా జట్టు నిలిచింది. ఆంధ్రప్రదేశ్ ఫుట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా ఫుట్ బాల్ సంఘం సహకారంతో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ సీనియర్ మహిళల అంతర్ జిల్లా ఫుట్ బాల్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఫుట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు, ఏలూరు పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై బహుమతులు అందజేశారు. ఎంపీ మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. క్రీడల నిర్వహణలో యూనివర్సిటీ సహకారం మరువలేనిదని చెప్పారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో క్రీడలు నిర్వహణ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఉంటుందని, రాష్ట్రంలో అన్ని ప్రధాన ఈవెంట్లను నిర్వహించుకునేందుకు నాగార్జున యూనివర్సిటీ మంచి వేదికగా ఉందని పేర్కొన్నారు. వీసీ మాట్లాడుతూ క్రీడల్లో అత్యున్నత మౌలిక సదుపాయాలు నాగార్జున యూనివర్సిటీలో ఉన్నాయని చెప్పారు. పోటీలలో ప్రథమ స్థానం అనంతపురం జిల్లా జట్టు, ద్వితీయ, తృతీయ స్థానాలు సత్యసాయి జిల్లా, కడప జిల్లాలు జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎండీ సిరాజుద్దీన్, ఫుట్ బాల్ పూర్వ శిక్షకులు సుధాకర్ పాల్గొన్నారు.

గ్రంథాలయశాస్త్ర సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేట 12/3లోని వావిలాల గ్రంథాలయసంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయ శాస్త్ర సర్టిఫికెట్ కోర్సు (సీఎల్ఐఎస్సీ)కు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సంస్థ ప్రిన్సిపాల్ దోనె రాంబాబు శుక్రవారం ఓప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్‌లో ఉత్తీర్ణులై, 18 ఏళ్ల వయసు నిండిన అభ్యర్థులు కోర్సులో ప్రవేశం పొందేందుకు అర్హులని తెలిపారు. ఐదు నెలల కాల వ్యవధి గల కోర్సులో తెలుగు, ఇంగ్లిషు మీడియంలో బోధన ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను సంస్థ చిరునామాకు పంపాలని సూచించారు. ఇతర వివరాలకు 93962 38946 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

వ్యవసాయ సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు
- పొలంబడిపై ఐదు జిల్లాల యంత్రాంగానికి శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు.

కొరిటిపాడు(గుంటూరు): మారుతున్న వ్యవసాయ సాంకేతికతను, సమగ్ర యాజమాన్య పద్ధతులను అందిపుచ్చుకుని వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు సూచించారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన వ్యవసాయ అధికారులు, సిబ్బందికి పొలంబడి కార్యక్రమంలో మేలైన యాజమాన్య పద్ధతులపై గుంటూరులోని కృషీ భవన్‌లో శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల్లో జరుగుతున్న అంతర్గత ఆడిట్, తనిఖీలపై సిబ్బందికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అలాగే ఎఫ్‌పీఓల ద్వారా అమలు అవుతున్న రైతు ఉత్పత్తిదారుల సంఘాలు నిర్వహించాల్సిన రికార్డులు, రిజిస్టర్లపై, ముఖ్యంగా యాజమాన్య పద్ధతుల, రైతులు తయారు చేయాల్సిన క్షేత్రస్థాయి నివేదికలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కమిషనరేట్ ఏడీఏ ఎం.వెంకటేశ్వర్లు, ఏఓ కిరణ్మయిజి.యుగంధర్, ఆత్మా ఇన్‌చార్జి పీడీ పి.రామాంజనేయులు, గుంటూరు ఏడీఏ టి.శ్రీనివాసరావు, ఐదు జిల్లాల వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ అథ్లెటిక్స్‌కు పలువురు ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): తమిళనాడులోని కోయంబత్తూరులో ఈ నెల 7 నుంచి 10 వరకు జరగనున్న 38వ జాతీయ జూనియర్ అథ్లెటిక్ పోటీలకు జిల్లా నుంచి 8 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులను స్థానిక చంద్రమౌళీ నగర్‌లోని నాథ్‌వెల్‌నెస్ సెంటర్లో రోటరీ క్లబ్ ఆఫ్ సెంటినల్ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీనివాసరావు, జిల్లా అథ్లెటిక్ సంఘం కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్‌లు అభినందించారు. ప్రసాద్ మాట్లాడుతూ కె.ఎస్.కె.నూర్, ఎస్.కె.రోషన్, సి.హెచ్.వి.మారుతీ గురు శంకర్, టి.నాగయోచన, బి.నాగ విహారిక, రూపాలిక పాత్ర, ఎండి ఆసియా, ఇ.హేమ సాయిలు ఎంపికయ్యారన్నారు. రాజు టీం మేనేజర్‌గా వ్యవహరిస్తారన్నారు. పతకాలు సాధించి జిల్లాకు పేరుతేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాథ్‌వెల్‌నెస్ సెంటర్ కోచ్ నూతలపాటి గోపీనాథ్, కోచ్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఎన్‌హెచ్‌ఎం, ఎన్టీఈపీ పథకంలో ఏడాదిపాటు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసేందుకు ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ మెడికల్ ఆఫీసర్ పోస్టు ఒకటి, మెడికల్ ఆఫీసర్ పోస్టులు మూడు, టీబీ, హెచ్ఐవీ పోస్టులు రెండు, స్టాటిస్టికల్ అసిస్టెంట్ పోస్టు ఒకటి, అకౌంటెంట్ ఉద్యోగాలు రెండు, పీపీఎం కోఆర్డినేటర్ ఒకటి, డిస్ట్రిక్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ఒకటి, టీబీ హెచ్‌వీ-ఎన్టీవో ఉద్యోగాలు ఆరు, ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలు ఆరు, సీనియర్ ట్రీట్‌మెంట్ ల్యాబ్ సూపర్‌వైజర్ ఉద్యోగాలు ఆరు భర్తీ చేసేందుకు అర్హత, ఆసక్తి ఉన్నవారిని దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. దరఖాస్తులు ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు జిల్లా టీబీ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. విద్యార్హతలు, వేతనాలు, దరఖాస్తు ఫారాల కోసం గుంటూరు.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలని వెల్లడించారు.